క్లుప్తంగా

సీతారాముల విగ్రహప్రతిష్ట

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ ఎర్రకొండక్కగారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ సీతారాముల విగ్రహప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. బుధవారం శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సీతారాముల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు.

సీతారాముల కల్యాణం

కలికిరి(వాల్మీకిపురం): పట్టణంలో శ్రీపట్టాభిరామాలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శ్రీరాముని జన్మనక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం వేద పండితులు మంత్రోశ్చరణల నడుమ కనుల పండుగగా శ్రీసీతారాముల కళ్యాణోత్సవం నిర్వహించారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

కేవీపల్లె : మండలంలోని పాశెంగడ్డ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు బండి రెడ్డెమ్మ దంపతులను బుధవారం ఆ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవోలు రెడ్డి బాషా, సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ పాశెంగడ్డ పాఠశాలలో తొమ్మిది సంవత్సరాలుగా రెడ్డెమ్మ సేవలు అభినందనీయమన్నారు.

బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

పీలేరు రూరల్ : ఈ నెల 23న మదనపల్లెలో నిర్వహించే బౌద్ధ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం పీలేరులో నిర్వహించిన బాస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మదనపల్లె బుద్ధుని కొండలో జరిగే బౌద్ధ సమ్మేళన కార్యక్రమానికి బుద్ధిస్టులు, అంబేడ్కరిస్టులు, సమాజ హితం కోరే కుల సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సరస్వతిదేవి విగ్రహప్రతిష్ట

తంబళ్లపల్లె : స్థానిక మోడల్‌స్కూల్‌లో బుధవారం చదువులతల్లి సరస్వతిదేవి విగ్రహప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. దాత మదనపల్లె రెడ్డి సంఘం అధ్యక్షులు, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ కనుగొండ మద్దిరెడ్డి సొంత నిధులతో సరస్వతిదేవి ఆలయం నిర్మించారు. కనుగొండ కుటుంబ సభ్యులకు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాగతించారు. పూజ కార్యక్రమంలో కనుగొండ మద్దిరెడ్డి, పద్మావతమ్మ, శేఖరరెడ్డి,సునీత దంపతులు పాల్గొన్నారు. హోమాల నిర్వహణ అనంతరం విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేశారు. అనంతరం సొంత నిధులతో 6,7 తరగతుల్లోని 80 మంది బాలురకు ఉచిత బస్సు పాసులు అందించారు. మదనపల్లె రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి కంభం నాగభూషణ రెడ్డి, రామమోహన్‌రెడ్డి, పునీత్, సహదేవ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా వ్యాధికి దోమకాటే కారణం

పీలేరు : మలేరియా వ్యాధికి దోమకాటే కారణమని స్థానిక ఏరియా ఆస్పత్రి డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ప్రపంచ దోమల దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాపించు వ్యాధుల నియంత్రణపై ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేగళ్లు, తలపుల పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు పెంపకంతో లాభాలు

బి.కొత్తకోట : పట్టు పెంపకం ద్వారా రైతులు లాభాలు ఆర్జించవచ్చని మైసూర్ పట్టుశాఖ శాస్త్రవేత్త డాక్టర్ తిరుపతయ్య అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో పట్టు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మేరా రేషమ్..మేరా అభిమాన్ కార్యక్రమం చేపట్టిందన్నారు. పట్టు సాగు చేయడం ద్వారా రైతులు ఆదాయంతో పాటు రాయితీలను పొందవచ్చని వివరించారు. సైంటిస్ట్–డీ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ, సీనియర్ సైంటిస్ట్ ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ ఆలయ కుంభాభిషేకం

కలికిరి : కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని పునఃప్రతిష్ఠించి పన్నెండేళ్ళు పూర్తయిన సందర్భంగా భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నారు. రెండవ రోజు బుధవారం ఉదయం అమ్మవారికి సూర్యారాధన, కళశ స్థాపన, పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రధాన కళశాలతో కలిపి 28 కళశాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. సాయంత్రం కళశార్చన, చండీ పారాయణం, వేద పండితుల మంత్రోశ్చరణలతో దీక్షా, సుదర్శన హోమం చేశారు.

గంగులప్ప మృతి తీరని లోటు

– మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం ఎర్లగుంట్ల బావికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జడ గంగులప్ప మృతి పార్టీకి తీరనిలోటని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం గంగులప్ప దశదినకర్మ కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే గంగులప్ప చిత్రపటాని పూలు వేసి ఘన నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బిడ్డల కేశవరెడ్డి, నీళ్ల భాస్కర్, మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, విజయ్, నరసింహులు, రామ్మోహన్, గంగులప్ప, నాగేంద్ర, కిరణ్, శ్రీనివాసులు, ఫారూక్ పాల్గొన్నారు.

కూటమి పాలనపై విశ్వాసం పోయింది

- పథకాల అమలులో చిత్తశుద్ధి లేదు
- సమన్వకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్



కూటమి పాలనపై క్యూఆర్ కోడ్‌తో అభిప్రాయాలు తీసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

మదనపల్లె : కూటమి పాలనలో ప్రజలు అన్ని విధాలా మోసపోయారని, పాలనపై ప్రజల్లో విశ్వాసం పోయిందని వైఎస్సార్‌సీపీ మదనపల్లె సమన్వయకర్త నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ ఒకటవ కౌన్సిల్ వార్డులో కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటి కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. మహిళలు, ప్రజలను నేతలు కలిస్తూ కూటమి పాలనలో అందిన సౌకర్యాలు, పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా కలిగిన లబ్ది గురించి అడిగి తెలుసుకున్నారు. దీనిపై ప్రజలు తమకు ఆర్థిక ప్రయోజనం కలిగించే పథకాలు అందడం లేదని వివరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడం కోసం కూటములతో జతకట్టి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చే శారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక హామీలను విస్మరించి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేశారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలతో ప్రజలను మోసం చేస్తారని ప్రజలు గుర్తించాలని మాజీ సీఎం వైఎస్.జగన్ ఎన్నికల్లో ప్రజలను పదేపదే కోరిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.2.70 లక్షల కోట్లు నేరుగా లబ్ది చేకూర్చిందని అన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు ఎన్నో కొర్రీలు వేస్తూ సంక్షేమం సాధ్యంకాదని బుకాయిస్తున్నారని అన్నారు. పథకాలను అమలు చేయడం ఇష్టంలేని చంద్రబాబు ఆర్థిక పరిస్థితులు అంటూ కుంటిసాకులు వెతుకున్నారని విమర్శించారు. గతకంటే బడ్జెట్ పెరిగింది, అప్పులు చేస్తుండగా పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడచినా అన్ని వర్గాలకు మోసం చేస్తున్నారని అన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జి.షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ వి.మనూజ మాట్లాడుతూ చంద్రబాబు నైజమే మోసమన్నారు. ఆయన రాజకీయ జీవితంలో ఈ విషయాలు స్పష్టంగా కనిపిస్తాయన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి లేని నిబంధనలతో ఇబ్బందులకు గురిచేశారన్నారు. ఒక పథకాన్ని ప్రారంభించే ముందు సమీక్షించి తుది నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం చేతకాదా అని ప్రశ్నించారు. నిరుద్యోగులకు ఇచ్చిన ఉద్యోగాల హామీ, నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో మహిళా రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసినట్టుగానే పథకాల అమలులో మోసం చే స్తున్నారని అన్నారు. అమలు చేయడంలో చిత్తశుద్ధి చూపనప్పుడు హామీలు ఎందుకివ్వాలని ప్రశ్నించారు. ప్రజలు చంద్రబాబు హామీలపై వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న బాబు ష్యూరిటి–మోసం గ్యారంటి కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో రహీం, నరేంద్ర, మంజు, వినుతాబాయి, మహేష్, మల్లికార్జున రెడ్డి, నూర్‌మోదిన్‌ఖాన, రాజేష్, విశ్వనాథ్, నాగమణి, చెన్నకేశవ, మల్లికార్జున, చలపతి, శ్రీరాములు పాల్గొన్నారు.

మోసానికి కేరాఫ్ సీఎం చంద్రబాబు



చంద్రబాబు మోసాలపై క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న నిసార్ అహ్మద్

నిమ్మనపల్లె : మోసానికి కేరాఫ్ అడ్రస్ సీఎం చంద్రబాబు నాయుడని వైఎస్సార్ సీపీ మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ అన్నారు. బుధవారం మండలంలోని అగ్రహారం, సామకోట వారి పల్లె గ్రామాలలో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేనిఫెస్టోను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. దీంతో స్థానికులు కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అన్యాయాలను ఏకరువు పెట్టారు. పింఛన్లు తొలగించడం, కరెంటు చార్జీలు పెంచడం, తదితర సమస్యలను ప్రస్తావించారు.ఈ సందర్భంగా నిసార్ అహ్మద్ మాట్లాడుతూ....కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోకుండా పాలన గాలికి వదిలేసి,అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు ఐదు కోట్ల మంది ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చేసిన మోసాన్ని ప్రజల ముందు ఉంచడానికి ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలన్నారు. గ్రామస్థాయిలోని ప్రజా ప్రతినిధులు నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి, బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ పేరుతో చంద్రబాబు మోసాలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమం, ప్రస్తుత ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్యం తేడాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఉషారాణి,మహదేవరెడ్డి, పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షులు రెడ్డి శేఖర్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి హేమంత్ కుమార్, నాయకులు నరేంద్ర రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, దయాకర్ రెడ్డి, రామారావు,రెడ్డి భాస్కర్, సుధాకర, నూర్ మొహిద్దిన్ ఖాన్, నాగరాజ, రాజగోపాల్,రెడ్డి శివ కృష్ణ, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సుకు నిరసనగా ఆటో డ్రైవర్ల ధర్నా



మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్ల ధర్నా

మదనపల్లె : స్త్రీశక్తి పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంపై నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం ఆటో డ్రైవర్లు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తమ ఉపాధికి నష్టం కలిగిస్తున్న కారణంగా ఆదుకోవాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఆటో వర్కర్స్ యూనియన్‌జిల్లా కార్యదర్శి ముబారక్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చామని ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే..ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయరా అని ప్రశ్నించారు. బీఎంఎస్ మండల కార్యదర్శి రెడ్డిబాషా, వేణుగోపాల్ రెడ్డి, తిరుమల, చంద్రశేఖర్, దేవా, రెడ్డెప్ప, వెంకటేష్, మస్తాన్, మహమ్మద్, కరీముల్లా, రమణ నాయక్, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి

పీలేరు : ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేషావలి అన్నారు. బుధవారం పీలేరులో నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలు నమ్ముకుని జీవిస్తున్న డ్రైవర్లు బతుకులు భారంగా ఉన్నాయన్నారు. బాడుగలు లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఆటో యూనియన్ నాయకులు రమణనాయక్, సయ్యద్, సుబ్రమణ్యం, రవి, ఖాజా, మాధవరెడ్డి, చక్రపాణి, నరసింహులు, రాజశేఖర్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం



మాజీ ఎమ్మెల్యే చింతలను సన్మానిస్తున్న జిల్లా రాజగోపాల్‌రెడ్డి తదితరులు

కలకడ : పార్టీ కోసం కష్టపడిన ప్రతికార్యకర్తకు సముచిత స్థానం కల్పించడానికి కృషి చేస్తామని, వైఎస్సార్ సీపీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే చింతలను రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి, కోన సర్పంచ్ జిల్లా రాజగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కూటమి పాలనలో అక్రమ కేసులకు భయపడకుండా, కార్యకర్తలను కాపాడుకోవడానికి కృషి చేయాలని పీలేరు మాజీ ఎమ్మెల్యే సూచించారు. వైఎస్సార్ సీపీమండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, జిల్లా రైతు విభాగం ప్రధానకార్యదర్శి ద్వారకనాథరెడ్డి, మండల ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షులు పాలకుంట రామాంజులు, నాయకులు జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

లేగదూడల పెంపకంపై పాడిరైతులు శ్రద్ధపెట్టాలి

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్ళై



లేగదూడలను ప్రదర్శనను పరిశీలిస్తున్న జిల్లా పశువైద్యాధికారి గుణశేఖర్‌పిళ్ళై, తదితరులు

కలకడ : పాడిరైతులు కేవలం పాలదిగుబడి, పాడి ఆవుల పెంపకంపై మాత్రమే కాకుండా లేగదూడల పెంపకంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్ళై అన్నారు. బుధవారం మండలంలోని నడిమిచెర్ల పంచాయతీలోని పశువైద్యశాల అధికారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేగదూడల ప్రదర్శనను పరిశీలించారు. పశుసంవర్ధక శాఖలోని పథకాలను తెలియజేశారు. పశువుల బీమా, లింగనిర్ధారణ, పశుగ్రాస విత్తనాల పంపిణీ, ఉచిత టీకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 52 మంది లేగదూడలను ప్రదర్శించగా ఉత్తమ పోషణ కలిగిన ఎల్.నాగేంద్ర రెడ్డి, యం.నిరంజన్, ఎల్.రెడ్డిశేఖర్‌రెడ్డిలను ఎంపిక చేసి పోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బివిస్వామి, తిరుపతి పశువైద్యాధికారి డాక్టర్ సుబ్బారావు, రా యచోటి ఉపసంచాలకులు డాక్టర్ శశికళ, డాక్టర్ తేజకళ్యాణ్, డాక్టర్ పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి



ప్యారంపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగప్రసాద్

గుర్రంకొండ : సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని వాల్మీకిపురం ఏడీఏ నాగప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని తరిగొండ, ప్యారంపల్లె గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే ప్రతి పంటకు ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా పంట నష్టపరిహారం అందుతుందన్నారు. భూసార పరీక్షను బట్టి పంటకు ఎరువులను తగినంత మోతాదులో వాడుకోవాలన్నారు. వ్యవసాయ పనిముట్ల సర్వే కోసం మీ సమీప రైతు సేవాకేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటసాగులో జిప్సంను పంట పూత సమయంలో ఎకరానికి 200 కేజీలు వినియోగించాలన్నారు. తద్వారా కాయలు గట్టి పడడమే కాకుండా గింజల్లో నూనె శాతం బాగా పెరుగుతుందన్నారు. ఎప్పటికప్పుడు వ్యసాయశాఖ సిబ్బంది సలహాలు, సూచనలు పాటించడం వలన రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, ఏఈవో నాగరాజు, ఎంపీఈవో షబానా పాల్గొన్నారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

డీఎస్పీ మహేంద్ర



మదనపల్లె రూరల్ : వినాయకచవితి పండుగ సందర్భంగా విగ్రహాలు ఏర్పాటు చేసే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని డీఎస్పీ మహేంద్ర తెలిపారు. బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ...వినాయక విగ్రహాలు ఏర్పాటుచేసుకుని ఉత్సవాలు చేసేందుకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ నిర్వహణ దరఖాస్తు ఫారంను ప్రత్యేకంగా రూపొందించామన్నారు. ఉత్సవకమిటీ పేరు, నిర్వాహకుల వివరాలు, ఆధార్‌నెంబర్లు, విగ్రహాన్ని ఉంచే ప్రదేశం, ఎత్తు వివరాలు, నిమజ్జనం తేదీ, సమయం, చేసే ప్రదేశం, ఊరేగింపు మార్గం, వాహన, డ్రైవర్ వివరాలు, మండపంలో రాత్రి బసచేసేవారి వివరాలు, ఫోన్‌నెంబర్లు దరఖాస్తు ఫారంలో నమోదుచేసి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఉత్సవ విగ్రహం, మండపాన్ని ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా నిర్మించుకోవాలన్నారు. మండపాల్లో, ఊరేగింపుల్లో రాజకీయ ప్రేరేపిత, ఉద్దేశపూర్వకమైన పాటలు, ప్రకటనలు చేయరాదన్నారు. మండపాల్లో అశ్లీలనృత్యాలు చేయించరాదన్నారు. స్పీకర్లు రాత్రి 10.30 గంటలకు కచ్చితంగా ఆపేయాలన్నారు. విగ్రహం 5 అడుగులు మించి ఉంటే తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలన్నారు వినాయక నిమజ్జనోత్సవాలు ముగిసేంతవరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటుతో పాటు క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు పనిచేస్తాయన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణ

కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి

నిమ్మనపల్లె : మేలైన యాజమాన్య పద్ధతులతో మామిడి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని కలికిరి కృషి విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్త శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని వెంగంవారి పల్లెలో ఉద్యాన శాఖ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో, మామిడి సాగులో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, కాయకోత అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కేవీకే శాస్త్రవేత్త డాక్టర్. ఏ. శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడిలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులలో, భాగంగా కొమ్మ కత్తిరింపులు, ముదురు చెట్ల పునరుద్ధరణ, తల మార్పిడి విధానంపై వివరించారు. కొమ్మ కత్తిరింపుల అనంతరం బోర్డ్ మిశ్రమం 1 శాతం, లేదా కాప్పర్ ఆక్సీ క్లోరైడ్ 2.5 గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారి చేయడం ద్వారా వ్యాధులు నివారించవచ్చన్నారు. ఉద్యాన అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉన్న పథకాలైన మామిడి, అల్లనేరేడు, దానిమ్మ, జామ, తదితర పండ్ల తోటలకి రైతులకు సబ్సిడీ ఉన్నాయన్నారు. ఎస్సీ ఎస్టీ రైతులకు మల్చింగ్ పేపర్, పూల మొక్కలు, కూరగాయల మొక్కలు సాగు చేసే రైతులకు ఎకరాకు రూ.8 వేలు రాయితీ అందుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

న్యూట్రెండ్స్‌పై విద్యార్థులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న శ్రీచరణ్ లక్కరాజు

కురబలకోట : విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న ట్రెండ్స్‌ను గుర్తించి అందుకు అనుగుణంగా అవగాహనతో ముందుకు సాగాలని హైదరాబాదులోని స్టూడెంట్ ట్రైబ్ కంపెనీ సీఈఓ శ్రీచరణ్ లక్కరాజు అన్నారు. అంగళ్లులోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో నూతన బీటెక్ విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాట్లాడుతూ టెక్నాలజీలో వస్తున్న మార్పులను పసి గట్టి ముందు సాగాలన్నారు. సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఏఐ, డిజిటల్ టెక్నాలజీ, ఫిన్టెట్, బయో, గ్రీన్ టెక్నాలజీ ఇలా ప్రతి మూడు నెలలకోసారి కొత్త ఆవిష్కరణలు, సరికొత్త టెక్నాలజీ వస్తోందన్నారు. స్టార్టప్ ప్రపంచంలో ముందడుగు వేసే అవకాశాలు విస్తారంగా ఉన్నాయన్నారు. జీవితంలో రాణించాలంటే ఇంజినీరింగ్‌తో పాటు అడిషినల్ కోర్సులపై పట్టు సాధించాలన్నారు. ఏఐ, డేటా సైన్స్, బ్లాక్ చైన్, రోబోటిక్స్ తదితర డిమాండు ఉన్న సాంకేతిక కోర్సులు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన వివిద సందేహాలను నివృత్తి చేశారు.

ఘనంగా తిరుప్పావడ సేవ



తిరుప్పావడ సేవలో వెంకన్న

మదనపల్లె సిటీ : స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో బుధవారం స్వామికి తిరుప్పావడ సేవ ఘనంగా నిర్వహించారు. స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి మహామంగళహారతి ఇచ్చారు. ఆలయం ఎదుట ఉత్సవ మూర్తులను అలంకరించి పులిహోరా అన్నరాశిని భాగాలుగా తయారు చేసి పైభాగమున ఒక అన్న కూటన్ని శిఖరాలుగా ఏడు అన్నరాశులను శిఖరాలుగా చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. స్వామికి వివిధ రకాల తీపి పదార్థాలు పెట్టారు. లోకాన్నంత సుభిక్షంగా ఉండాలని ఆలయ ప్రధాన అర్చకులు గోవర్ధన్‌భట్టార్ తిరుప్పావడ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

గణేష్ మండపాలకు అనుమతి తీసుకోవాలి

కేవీపల్లె : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండలంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేసేవారు ముందస్తు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గణేష్ విగ్రహాలు ఏర్పాటుకు మూడు రోజులు పోలీస్ స్టేషన్‌లో తెలియజేసి అనుమతి పొందాలన్నారు. గణేష్ విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

పెద్దమండ్యం : వినాయకచవితి పండుగ సందర్భంగా గ్రామాలలో విగ్రహాలను ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని ఎస్ఐ ముత్యాల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. అనుమతి లేకుండా పల్లెల్లో విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తేజస్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

పెద్దమండ్యం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా సాంఘిక సంక్షేమశాఖ డీడీ దామోదర్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోజువారి వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. ఆసుపత్రిలో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని సూచించారు. అనంతరం మోడల్ పాఠశాలను, హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో విద్యార్థునులకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ప్రిన్సిపల్ రామాంజులు నాయక్ పాల్గొన్నారు.

వ్యాపార ఆలోచనలు పెంపొందించుకోవాలి

పీలేరురూరల్ : యువత వ్యాపార ఆలోచనలు పెంపొందించుకోవాలని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ మాస్టర్ ట్రైనర్ ఖాలిద్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక సంజయ్ గాంధీ డిగ్రీ కళాశాలలో ఆవిష్కాంధ్ర కార్యక్రమం ద్వారా సృజనాత్మకత వ్యాపార ఆలోచనలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్త కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. యువత అవకాశాలు అందిపుచ్చుకుని ఉద్యోగాన్ని కోరేవారు కాకుండా ఉద్యోగాన్ని అందించేవారుగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి, సమన్వయకర్త సంధ్య, అధ్యాపకులు వెంకటరమణయ్య, ఖాదర్‌బాషా, ప్రశాంత్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం పనులు పరిశీలన

రామసముద్రం : మండలంలోని మూగవాడి గ్రామ పంచాయతీలో బుధవారం డోర్ టు డోర్ గార్బేజ్ కలెక్షన్‌ను ఎంపీడీఓ గఫూర్ పరిశీలించారు. అలాగే ఎస్ డబ్ల్యూ పిసి షెడ్డును సందర్శించి తగు సూచనలు అందించారు. పొడి చెత్త.. తడి చెత్త వేరు చేసి సంపద తయారీకి సహకరించాలని సూచించారు. అలాగే ఎం. గొల్లపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రంలో పిల్లల హాజరును పరిశీలించారు. ప్రభుత్వం అందజేసే సరుకులను పిల్లలకు, బాలింతలకు సక్రమంగా అందజేయాలని సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్యం పరిశీలించారు.

కొత్త ఆవిష్కరణల వైపు దృష్టి సారించాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు కొత్త ఆవిష్కరణపై దృష్టి సారించాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పుంగనూరురోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో ఆవిష్కాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల ఆలోచనలు కూడా సరికొత్తగా ఉండాలన్నారు. ఇంజనీరింగ్ దశ నుంచే నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. మంచి అవకాశాలు వస్తాయని ఇందు కోసం ఇప్పటి నుంచి కృషి చేయాలన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాయుడు స్టార్టప్ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సెక్రటరీ రామమోహన్‌రెడ్డి, చైర్మన్ నాగమల్లా రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి

తంబళ్లపల్లె : జాతీయస్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి మహమ్మద్ అజహర్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్, పీడీ లత తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 26,27 తేదీల్లో మదనపల్లె వశిష్ట స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరఫున ప్రతిభ చాటడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో బీహార్ రాష్ట్రం బుద్ధగయలో జరిగే 44వ జాతీయ స్థాయి షూటంగ్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థిని ఎంఈఓలు త్యాగరాజు,నాగసుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

356 మంది పింఛనుదారులకు నోటీసులు

పెద్దమండ్యం : మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో రీ వెరిఫికేషన్‌కు వెళ్లిన డీఎంహెచ్‌వో వికలాంగుల పింఛనుదారుల్లో 356 మందికి నోటీసులు ఇచ్చినట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు బుధవారం తెలిపారు. ఇందులో రూ. 15 వేలు పొందుతున్న వారిలో కొందరిని అనర్హులుగా గుర్తించి రూ. 6 వేలకు మార్చినట్లు తెలిపారు. అనర్హులైన వారికి పింఛను తొలగించినట్లు తెలిపారు. అలాగే వికలాంగుల పింఛను పొందుతున్న వారిలో వికలత్వం లేకున్నా పింఛను పొందుతున్నారని గుర్తించి తొలగించినట్లు చెప్పారు. వికలత్వం సర్టిఫికెట్ తప్పుగా ఉంటే వయస్సు అర్హత ఉన్న పలువురికి ఓఏపి పింఛను దారులుగా మార్చినట్లు తెలిపారు. ఎవరైనా అర్హత కలిగి పింఛను తొలగించారనే పింఛనుదారులు ఎంపీడీవో కార్యాలయంలో తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు.